

కథా కౌముది

# కథ కంచికి అమ్మాయి యింటికి

కొండగుంట వెంకటేష్

తన గదిలో కూర్చుని అప్పుడే భోజనం ముగించాడు చక్రపాణి. ఫోర్త్ క్లాస్ ఎంప్లాయ్ ఓబలేసు వచ్చి టేబుల్ శుభ్రం చేసి ప్లేటు తీసుకుని వెళ్ళిపోయాడు. సమయం పదిగంటలు కావస్తోంది. షెడ్యుల్ టైం ప్రకారం ఇంకో గంటలో హైదరాబాదు ప్యాసింజర్ రైలు రావాలి. కాని ఆ ట్రైన్ ఎప్పుడు టైంకు రాదు. ప్రతిరోజు ఒకటి రెండు గంటలు ఆలస్యంగా రావటం మామూలే.

పావురాలపల్లి పెద్ద ఊరుకాదు. ఆ రూట్ లో పెద్దగా రష్ కూడా ఉండదు. ప్రతిరోదు ఆ ఊళ్ళో రెండు రైలు మాత్రమే ఆగుతాయి. ఒకటి పగలు వస్తుంది. అయిదునిమిషాలు మాత్రం ఆగుతుంది. రెండోది రాత్రి వచ్చే ప్యాసింజర్ ట్రైన్. పది నిమిషాలు ఆగుతుంది. ఈ మధ్యలో ఎన్నో రైళ్ళు వస్తాయి కాని ఏది పావురాలపల్లిలో ఆగవు. అందుకే స్టేషన్ మాస్టర్ గా చక్రపాణికి ఎక్కువగా పనిఉండదు. కాకపోతే అతని డ్యూటికి టైం అంటు ఉండదు. రాత్రి వచ్చే ప్యాసింజర్ రైలు ప్రతిరోజు ఆలస్యంగా రావటం వల్ల అతను చాల సేపు స్టేషన్ లో ఉండవలసివస్తుంది. ఆ రైలు వెళ్ళేంతవరకు కాచుకుని ఉండాలి. అది వెళ్ళిపోతే కాని అతని డ్యూటి పూర్తికాదు.

గదిలోంచి బయటకు వచ్చి చుట్టు చూశాడు చక్రపాణి. స్టేషన్ లో పెద్దగా ప్రయాణికులు లేరు. ముగ్గురు మాత్రం ఒక మూల కూర్చుని పిచ్చాపాటి మాట్లాడుకుంటున్నారు. అప్పుడే వాతావరణంలో విపరీతమైన మార్పు వచ్చింది. ఆకాశం మేఘాలతో పూర్తిగా నిండిపోయింది. నల్లచీర కప్పుకున్నట్టు ఆకాశం పూర్తిగా కారుమబ్బులతో నిండిపోయింది. గాలివేగంగా వీస్తోంది. ఏ సమయంలోనే అయిన వర్షం వచ్చే సూచన కనిపిస్తుంది.

అతను ఊహించింది నిజమైంది. సన్నగా వర్షం మొదలైంది. అసలే ప్యాసింజర్ రైలు. ఏ రోజు టైంకు వచ్చిన పాపాన పోలేదు. ఇప్పుడు ఈ వర్షం కూడా తోడైతే ఇక చెప్పవలసిన పనిలేదు. రాత్రంతా జాగరణ చెయ్యవలసివస్తుంది. ఈ రకంగాఆలోచిస్తూ చక్రపాణి లోపలికి వెళ్ళబోతుంటే అప్పుడే ఒక అమ్మాయి అతనికి ఎదురుపడింది. చాల పెద్దింటి అమ్మాయిలా ఉంది. ఖరీదైన చీర జాకెట్టు వేసుకుంది. అది కాదు అతన్ని ఆశ్చర్యం పరుస్తుంది. ఒంటినిండా నగలు దిగేసుకుంది. సాధారణంగా రాత్రివేళ ప్రయాణం చేసేటప్పుడు ఎవరు ఇన్ని నగలు పెట్టుకుని ప్రయాణం చెయ్యరు.

“అంకుల్ హైదరాబాదు ప్యాసింజర్ ఎప్పుడు వస్తుంది?”అడిగింది.

“ఇంకో గంటలో రావాలి. కాని ఈ వాతావరణం చూస్తుంటే ఎప్పుడు వస్తుందో చెప్పలేను”అన్నాడు చక్రపాణి.

“వర్షం వస్తుంది లోపల కూర్చోవచ్చా?”అడిగింది ఆ అమ్మాయి.

“నిరభ్యంతరంగా వెళ్ళి కూర్చో. దీనికి పర్మిషన్ అవసరంలేదు”అన్నాడు చక్రపాణి.

ఆమె ఠీవిగా నడుస్తూ వెళ్ళి బెంచిమీద కూర్చుంది.

చక్రపాణి ఆమెకు ఎదురుగా కూర్చుని “ఎక్కడికి వెళ్ళాలి?”అని అడిగాడు.

"హైదరాబాదు."

"ఒక్కదానివే వెళుతున్నావా? తోడుగా ఎవరు లేరా?"

"నాతో మా బావ వస్తున్నాడు. తనకు ఏదో అర్జంట్ పనిపడింది. నన్ను ముందు వెళ్ళిటికెట్టు తీసుకోమని చెప్పి తరువాత తను వస్తానని చెప్పాడు."

"నీ పేరు ఏమిటమ్మా? ఇలా అడుగుతున్నందుకు ఏం అనుకోకు. నీ తండ్రిలాంటి వాడిని."

"ఫర్వాలేదు అంకుల్ నా పేరు స్వాతి."

ఆ పేరు వినగానే ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు చక్రపాణి.

"ఆశ్చర్యంగా ఉంది. నా కూతురు పేరు కూడా స్వాతి."

"మీకు నా లాంటి కూతురు ఉందన్నమాట."

"ఉండేది కాని ప్రస్తుతం ఇక్కడ లేదు."

"ఎక్కడ ఉంది. సిటిలో చదువుకుంటుందా?"

"ఈ ప్రపంచం విడిచి వెళ్ళిపోయిందమ్మా" అన్నాడు విచారంగా చక్రపాణి.

"వెరిసారీ అంకుల్. మీ అమ్మాయిని గుర్తుచేసి అనవసరంగా మీకు బాధ కలిగించాను"అంది ఆ సానుభూతిగా

"ఇంతకి మీ అమ్మాయి ఎలా చనిపోయింది? జబ్బుచేసి చనిపోయిందా?"

"జబ్బుతో చనిపోయి ఉంటే ఇంత బాధపడేవాడిని కాను. నా ఖర్మ అనుకుని సరిపెట్టుకునేవాడిని. కాని ఒక నీచుడిని నమ్మి మోసపోయింది. వాడు నా కూతురిన ప్రేమించినట్టు ప్రేమించి కోరిక తీర్చుకుని పారిపోయాడు. ఆ అవమానం తట్టుకోలేక నా కూతురు మానసీక వేదనతో చనిపోయింది. నిన్నుచూస్తుంటే నా కూతురిని చూసినట్టుగా ఉంది. పైగా నీ పేరు కూడా స్వాతి కావటం ఇంకా ఆశ్చర్యం కలిగించింది. భగవంతుడే నా కూతురిని నీ రూపంలో చూపించాడని తోచింది. అందుకే పని గట్టుకుని నిన్ను పలకరించాను"అన్నాడు చక్రపాణి.

ఆ అమ్మాయి ఏదో మాట్లాడబోయింది. ఇప్పుడే వస్తానని చెప్పి చక్రపాణి వెళ్ళాడు. వర్షం యెడతేరిపిలేకుండ ఇంకా కురుస్తునే ఉంది. అప్పుడప్పుడు ఢాం అంటు ఎక్కడో పిడుగుపడిన చప్పుడు చెవులను బద్దలు చేస్తోంది. దానికి తోడు కళ్ళు మిరమిట్లు గొలిపే మెరుపులు. ఒక్క మాటలో చెప్పాలంటే వాతావరణం భీభీత్సంగా ఉంది. ఈ రోజు ప్యాసింజర్ రైలు పరిస్థితి ఇంతే. అది ఎప్పుడు వస్తుందో ఎవరు ఊహించలేరు. ఈ విషయం మాత్రం చక్రపాణి ఆ అమ్మాయితో చెప్పలేదు.

"మిమ్మల్ని ఒక ప్రశ్న అడుగుతాను ఏం అనుకోరు కదా?"అంది ఆ అమ్మాయి.

"నిరభ్యంతరంగా అడుగు. ఏం అనుకోను " అన్నాడు చక్రపాణి.

"మీ అమ్మాయి చనిపోయిందని చెప్పారు కదా. ఎలా చనిపోయిందా తెలుసుకోవాలని ఉంది అంకుల్. మీకు ఇష్టమైతే ఆమె గురించి చెప్పండి".

"చెప్తాను విని తట్టుకోగలవా అని నా భయం. అంత దయనీయంగా ఉంటుంది నా స్వాతి కథ."

"ఫర్వాలేదు చెప్పండి"అని సర్దుకుని కూర్చుంది ఆ అమ్మాయి.

"స్వాతి నాకు ఒక్కగానొక్క కూతురు. చిన్నతనంలోనే తల్లిని కోల్పోయింది. అప్పటినుంచి నేను తల్లి తండ్రిని అయి పెంచి పెద్ద చేశాను. ఏ కష్టం రాకుండ కంటికి రెప్పలా చూసుకున్నాను. తను ఏది కావాలని అడిగిన వెంటనే తెచ్చిఇచ్చేవాడిని. చిన్న విషయానికి కూడా ఆమెకు కష్టం రాకుండ చూసుకున్నాను. ఒక మాటలో చెప్పాలంటే ఒక మహారాణిలా పెంచాను. నాది స్టేషన్ మాస్టర్ ఉద్యోగం. ప్రతిరెండు సంవత్సరాలకు బదీలీలు తప్పనిసరి. ప్రభుత్వం నన్ను సిటి ఏరియాకు ట్రాన్స్ ఫర్ చెయ్యకుండ ప్రతి సారి పావురాలపల్లి లాంటి చిన్న ఉళ్ళకు బదిలీ చేసేది. అక్కడ చదువుకోవటానికి పెద్దగా వసతులు ఉండవు. మంచి స్కూల్స్ కాని కాలేజిలు కాని లేవు. అందుకే స్వాతిని సిటిలో హాస్టల్ లోఉంచి చదివించాను."

"నాకు స్వాతి తప్ప ఈ ప్రపంచంలో వేరేవరులేరు. ఆమెను సంవత్సరాలతరబడి విడిచి ఉండటం చాల కష్టంగా తోచేది. స్వాతి కూడా నాకు దూరంగా ఉండటం ఇష్టపడేది కాదు. కాని నా కూతురు భవిష్యత్తు బాగుండాలని ఆమె అభివృద్ధిలోకి రావాలని నా కోరిక జీవితాశం. అందుకే మనస్సులో ఎంత కష్టంగా ఉన్నా అన్ని దిగమింగుకుని స్వాతిని పంపించాను. ఆమె వెళ్ళిన తరవాత ఒంటరితనంతో నేను ఎంత బాధపడ్డానో ఆ దేవుడికే తెలుసు. ఒక్కోక్కోసారి పిచ్చిపటటినట్టుగా ఉండేది."

"స్కూల్ చదువు అయిన తరువాత స్వాతి కాలేజికి వచ్చింది. తను ఎప్పుడు చదువులో ముందుండేది. ప్రతి క్లాసులో మెరిట్ లో విజయం సాధించేది. ఆమెను బాగాచదివించి ఉన్నత శిఖరం మీద పెట్టాలి. ప్రతి నిమిషం ఇదే ఆలోచించేవాడిని. స్వాతి కూడా నా మనస్సు తెలుసుకుని దానికి అనుగుణంగా నడుచుకునేది. రోజులు గడుస్తున్నాయి. స్వాతి డిగ్రి ఫైనల్ ఇయర్ కు వచ్చింది. డిగ్రి అయిన తరువాత ఆమెను ఐఏయస్ కు కూర్చోపెట్టాలని నిర్ణయించుకున్నాను. అందుకే ఆమె పరీక్షలు ఎప్పుడు పూర్తిఅవుతాయా ఎప్పుడు ఇంటికి వస్తుందా అని ఆత్రంగా ఎదురుచూసేవాడిని. "

"డిగ్రి చివరిసంతవత్సరం ఆఖరి సెమిస్టర్ పరీక్షలు రాసి ఇంటికి వచ్చింది నా కూతురు. నా సంతోషానికి అవధులు లేకుండ పోయింది. కొన్ని రోజులు విశ్రాంతి తీసుకోనిచ్చి తరువాత ఐఏయస్ పరీక్ష గురించి మాట్లాడాలని అనుకున్నాను. ఒకరోజు నా స్నేహితుడు రాజగోపాల్ మా ఇంటికి వచ్చాడు. అతను నాకు ఎంతో ఆత్మీయుడు. ఇద్దరం చిన్నతనంలో ఒకే స్కూలులో చదివాం. తరువాత అతను కాలేజి చదవు చదవటానికి వేరే ఊరికి వెళ్ళాడు. నేను మా ఊళ్ళోనే లోకల్ కాలేజిలో చేరాను. "

"శారీరకంగా మేము దూరం అయిన తరుచు ఉత్తరాలు రాసుకునేవాళ్ళం. అప్పుడప్పుడు ఫోన్ లో మాట్లాడుకునేవాళ్ళం. అప్పటిలో సెల్ ఫోన్స్ కాని లాండ్ లైన్ ఫోన్స్ కాని విరివిగా ఉండేవి కావు. అందుకే అతను పోస్ట్ ఆఫీసకు కాల్ చేసేవాడు. అతనికి నాకంటే రెండు సంవత్సరాలు ముందు పెళ్ళయింది. వాడికి ఒక్కడే కొడుకు. కంప్యూటర్ కోర్స్ లో పెద్ద డిగ్రీ తీసుకుని పెద్ద కంపెనిలో సాఫ్ట్ వేర్ ఇంజీనీర్ గా చేరాడు. మనిషి చూడటానికి చాల బాగుంటాడు. తనకు స్వాతిని కోడలిగా చేసుకోవాలని చెప్పాడు. "

" నాకు సంతోషంతో మాటలు రాలేదు. ఇది కలా నిజమా అన్న సందేహంలో పడిపోయాను. తరువాత సంతోషంతో ఊగిపోయాను. నిజానికి స్వాతికి ఇంతకంటే మంచి సంబంధం నేను తీసుకురాలేను.అదృష్టం కొద్ది ఒక గొప్ప సంబంధం నన్ను వెతుక్కుంటు వచ్చింది. పైగా రాజగోపాల్ కొడుకులో ఒంక పెట్టటానికి నాకు ఏం కనిపించేదు. నా స్థానంలో ఇంకేవరైన ఉంటే వెంటనే సరే అనేవారు. కాని నేను అలా అనలేకపోయాను. ఒకసారి స్వాతితో మాట్లాడి తరువాత నా నిర్ణయం చెప్తానని అన్నాను. రాజగోపాల్ ఏం అనుకోలేదు. చిరునవ్వుతో అలాగే అన్నాడు. "

"ఒకరోజు స్వాతి మంచి మూడ్ లో ఉండటం చూసి పెళ్ళి ప్రస్తావన తీసుకువచ్చాను. కాబోయే పెళ్ళికొడుకు ఫోటో కూడా చూపించాను. ఆ ఫోటో చూసి ఎగిరిగెంతెసి పెళ్ళికి ఒప్పుకుంటుందని భావించాను. సంతోషంతో ఆమె మొహం వెలిగిపోతుందని అనుకున్నాను. కాని అలాంటిది ఏం జరగలేదు. నేను అనుకున్నది ఒకటి జరిగింది ఇంకోకటి. పెళ్ళికొడుకు ఫోటో చూడగానే నా కూతరు మొహం సున్నం కొట్టినట్టు తెల్లగా పాలిపోయింది. ఒక్క క్షణం పాటు నాతో ఏం మాట్లాడలేకపోయింది. తరువాత మెల్లగా తేరుకుని అంది.

"నీ మాట కాదంటున్నందుకు ఏం అనుకోకు నాన్న. నాకు ఈ సంబంధం ఎంత మాత్రం ఇష్టంలేదు. నేను ఇదివరకే ఒక అబ్బాయిని ప్రేమించాను. అతను కూడా నన్ను ఎంతో ఇష్టపడ్డాడు. ఇద్దరం పెళ్ళిచేసుకోవాలని తీర్మానించుకున్నాం. ఈ విషయం నీకు చెప్పాలని ఎన్నోసార్లు అనుకున్నాను. కాని ధైర్యం చెయ్యలేకపోయాను. ఇప్పుడు ఈ ప్రస్తావన వచ్చింది కనుక చెప్పుతున్నాను అంది."

"ఇంతకి ఆ అబ్బాయి ఎవరు? "శాంతంగానే అడిగాను.

"లోకల్ యం.యల్ ఏ ఒక్కగానొక్క కొడుకు. ఇద్దరం ఒకే కాలేజిలో చదువుకుంటున్నాం. పైగా అతను నా క్లాస్ మెట్. నేనంటే చాల ఇష్టం తనకి. నన్ను విడిచి ఒక్క క్షణం కూడా ఉండలేడు. నువ్వు సరేనంటే అతన్ని పెళ్ళి చేసుకుంటాను"అంది చిన్నపిల్లలా.

వెంటనే నాకేం మాట్లాడాలో తోచలేదు. ఆ యం.యల్ ఏ గురించి నాకు బాగా తెలుసు. దాదాపు పది అవినీతి కేసులలో అతను ఇరుక్కుపోయాడు. అతని మీద సిబిఐ దర్యాప్తు కూడా మొదలైంది. ఈ విషయం అన్ని పేపర్స్ లోను ప్రముఖంగా వచ్చాయి. అయిన స్వాతికి ఈ విషయం ఎలా తెలియలేదా అని ఆశ్చర్యపోయాను. ఒక వేళ అబ్బాయి మంచివాడే కావచ్చు. నేను మనస్సు మార్చుకుని ఈ సంబంధానికి సరే అనవచ్చు.

కాని యం.యల్. ఏ ఒప్పుకుంటాడా. అతని అంతస్థుకి నా అంతస్థుకి భూమికి ఆకాశానికి ఉన్నంత తేడాఉంది. ఒక సామాన్యమైన స్టేషన్ మాస్టర్ తో సంబంధం కలుపుకుంటాడా అతను.

అదే విషయం స్వాతికి చెప్పాను.

"తండ్రి చెడవాడే కావచ్చు. కాని అబ్బాయి చాల మంచివాడు నాన్న. ఒకవేళ అతని తండ్రి ఈ పెళ్ళికి ఒప్పుకోకపోతే ఏం ఫర్వాలేదు. తండ్రిని ఎదిరించి ధైర్యంగా నన్ను పెళ్ళిచేసుకుంటాడు. అ నమ్మకం నాకుంది"అంది స్వాతి.

కాని నాకు మాత్రం ఏ మాత్రం నమ్మకం కలగలేదు. రాజకీయనాయకుల సంగతి నాకు బాగా తెలుసు. అందుకే స్వాతిని అతన్ని మరచిపోమని చెప్పాను. నేను తెచ్చిన సంబంధానకి ఒప్పుకోమని మెల్లగా చెప్పాను. కాని స్వాతి వినిపించుకోలేదు. తను పట్టిన కుందేలుకు మూడే కాళ్ళు అన్నట్టుగా ప్రవర్తించింది. అతన్ని తప్ప ఇంకేవరిని పెళ్ళిచేసుకోనని ఖరాఖండిగా చెప్పింది.

ఇంత శాంతంగాచెప్పిన స్వాతి వినకపోయేసరికి నా సహనం పూర్తిగా పోయింది. కోపంతో ఊగిపోయాను. ఆరునూరైన నేను తెచ్చిన సంబంధం చేసుకోవాలని లేకపోతే నా చావు చూస్తావని బెదిరించాను. దాంతో స్వాతి ఏడుస్తూ తన గదిలోకి వెళ్ళి గడియవేసుకుంది. ఆ రాత్రి ఆమె భోజనం కూడా చెయ్యలేదు. నేను చాలసార్లు తలుపు తట్టి పిలిచాను. కాని లోపలనుంచి ఎలాంటి జవాబు రాలేదు. నాకు కూడా ఆరోజు భోజనం చెయ్యాలనిపించలేదు. అలాగే ఖాళీ కడుపుతో పడుకున్నాను. "

"మరుసటి రోజు ఉదయం కొంచం ఆలస్యంగా నిద్రలేచాను. రాత్రి జరిగిన సంఘటన గుర్తుకువచ్చింది. వెంటనే లేచి స్వాతి గదిలోకి వెళ్ళాను. తలుపులు బార్లా తెరిచిఉన్నాయి. లోపల స్వాతి లేదు. ఆమెతో పాటు ఆమెకు సంబంధించిన సామానులు లేవు. ఇల్లంతా వెతికాను. ఎక్కడ కనిపించలేదు. దాంతోనాకు అంతా అర్ధమైంది. నేను అనుకున్నంతపని చేస్తానని భయపడి నా కూతురు ఇంట్లోంచి పారిపోయింది. పచ్చిగా చెప్పాలంటే లేచిపోయింది. అది నిజమే అని నిరూపిస్తూ టిపాయ్ మీద ఆమె రాసిన ఉత్తరం కనిపించింది. అందులో రెండు వాక్యాలు మాత్రం ఉన్నాయి.

"నాన్నగారు నేను వెళ్ళిపోతున్నాను. నాకోసం వెతకొద్దు. పెళ్ళి చేసుకున్న తరువాత నా భర్తతో మీ ముందు ఉంటాను."

"ఉత్తరం పట్టుకుని నేలమీద కూలిపోయాను. ఆ షాక్ నుంచి తేరుకోవటానికి నాకు పది రోజులు పట్టింది. ఇన్ని రోజులు గడిచిన స్వాతి మాత్రం రాలేదు. బహుశా నా మీద కోపంగా ఉండిఉంటుంది. త్వరలోనే వస్తుందని సరిపెట్టుకున్నాను. కాని నెలరోజులు గడిచిన ఆమె జాడ లేదు. కనీసం నాకు కాల్ కూడా చెయ్యలేదు. నాకు చాల భయం వేసింది. పోలీస్ రిపోర్ట్ ఇచ్చాను."

"రోజులు గడిచిన స్వాతి జాడమాత్రం తెలియలేదు. ఎక్కడుందో ఏం చేస్తుందో అని ప్రతిక్షణం తల్లడిల్లిపోయాను. ఎలోగో మనస్సు కుదుటపరుచుకుని నా రొటిన్ జీవితంలో పడిపోయాను. ఆరునెలలు గడిచాయి. ఒకరోజు ఆఫీసునుంచి లేటుగా వచ్చాను. గుమ్మం దగ్గర ఒక ఆకారం కనిపించింది. చీకటిగా ఉండటం వల్ల ఆ ఆకారం మొహం కొంచం కూడా కనిపించలేదు. ఎవరమ్మా నువ్వు " అని అడిగాను.

"నేను నాన్న స్వాతిని "అని నా కూతురు గొంతు వినిపించింది.

ఆశ్చర్యం సంతోషం నన్ను ఒక్కసారిగా కుదిపేశాయి. ఆ సమయంలో ఆ బలం ఉత్సాహం ఎలా వచ్చాయో తెలియదు వేగంగా వెళ్ళి స్వాతిని దగ్గరకు తీసుకున్నాను. వెక్కివెక్కి ఏడుస్తూ నన్ను చుట్టుకుపోయింది. మెల్లగా నడిపించుకుంటు లోపలికి తీసుకువెళ్ళాను. లైటు వెలుగులో ఆమెను చూసిన నేను కర్రాయిలా బిగుసుకుపోయాను. నా మైండ్ బ్లాంక్ అయిపోయిన ఫీలింగ్ కలిగింది. నా స్వాతి వాలకం పూర్తిగా మారిపోయింది. అప్పుడు ఉన్న స్వాతికి ఇప్పుడు నా కళ్ళ ముందు ఉన్న స్వాతికి ఎంతో తేడా ఉంది. అప్పుడు అందంగా బార్బీడాల్ లా ఉండేది. ఇప్పుడు చిరిగి పోయిన మాములు బొమ్మాలా ఉంది. శరీరం మీద నల్లని మచ్చలు కొట్టోచ్చినట్టు కనిపిస్తున్నాయి. స్వాతి ఏదో జబ్బుతో బాధపడుతుందని నాకు అర్ధమైంది."

కొంచంసేపటితరువాత తేరుకుని అసలు కథ చెప్పింది స్వాతి.

"అతను నన్ను దారుణంగా మోసం చేశాడు. పెళ్ళి చేసుకుంటానని నమ్మించి గొంతు కోశాడు. తన కోరికను తీర్చుకని నా జీవితాన్ని సర్వనాశనం చేశాడు. అంతటితో విడిచిపెట్టకుండ డబ్బుకోసం నన్ను ఒక బ్రోతల్ కంపెనికి అమ్మేశాడు. అక్కడనుంచి తప్పించుకోవాలని ఎంతో ప్రయత్నించాను. కాని వీలుకాలేదు. పైగా యజమానురాలితో చావు దెబ్బలు తిన్నాను. కుక్కను కొట్టినట్టు కొట్టింది. ఇంకోసారి తప్పించుకుంటే

చంపేస్తానని బెదిరించింది. ఆ తరువాత నేను మళ్ళీ తప్పించుకోవటానికి ప్రయత్నించలేదు. నా ఖర్మ ఇంతే అని సరిపెట్టుకున్నాను. నీ మాటలు విననందుకు నాకు తగిన శాస్తీ జరిగిందని అనుకున్నాను. అందుకే మానసీకంగా శారీరకంగా అన్నిటికి సిద్దమైపోయాను. "

"కొన్ని రోజుల తరువాత నా అదృష్టం బాగుంది. ఒక యన్ జీ వో సంస్ద పోలీసుల సహాయంతో మా బ్రోతల్ మీద దాడిచేసింది. యజమానురాలితో సహ ఆమె అనుచరులందరిన అరెస్ట్ చేసింది. అక్కడ నా లాంటి వాళ్ళు చాల మంది ఉన్నారు. వాళ్ళకు డబ్బు ఇచ్చి వాళ్ళవాళ్ళ ఊరికి పంపించేసింది. ఆ విధంగా నేను ఇక్కడికి చేరుకున్నాను. నన్ను క్షమించు నాన్న. ఆ రోజు నీ మాటలు విని ఉంటే నా జీవితం ఇలా ఉండేది కాదు. నా మూర్ఖత్వం వల్ల నా పరువుతో పాటు మన ఇంటి పరువు కూడా మంటకలిపాను. సమాజం నిన్ను చీదరించుకునేలా చేశాను. అందుకు నన్ను క్షమిస్తావా నాన్న"అంది.

నా తండ్రి మనస్సు తల్లడిల్లిపోయింది. వెంటనే మరునాడు ఆమెను మంచి హాస్పటల్ లో చేర్చాను. రెండు రోజుల వరకు స్వాతి బాగానే ఉంది. ట్రీట్ మెంట్ కు రెస్పాండ్ అయింది. కాని మూడో రోజు ఏమైందో తెలియదు. పరిస్ధితి విషమించింది. ఆమెను కాపాడటానికి డాక్టర్స్ ఎంతో ప్రయత్నించారు. కాని ఏం లాభం లేకుండ పోయింది. స్వాతి చనిపోయింది. ఉన్న ఒక్కగానొక్క కూతరు నన్ను శాశ్వతంగా విడిచి దూరతీరాలకు వెళ్ళిపోయింది. నా జీవితాన్ని నిస్సారంగా చేసి మరి వెళ్ళింది."

"స్వాతి వెళ్ళి పోయిన తరువాత నాకు జీవితం మీద విరక్తికలిగింది. ఒక్కోక్కోసారి ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచన వచ్చేది. కాని చావటానికి ధైర్యం చాలలేదు. జీవితం అనేది జీవించటానికి చావటానికి కాదు అన్న మాటలు గుర్తుకువచ్చి ఆగిపోయాను. ఆ క్షణం నుంచి స్వాతిని తలుచుకుంటు ఇలా బతుకుతున్నాను ఇది నా కథ "అని ముగించాడు చక్రపాణి.

అతని కళ్ళలో నీళ్ళు చిప్పిల్లాయి.

"బాధపడకండి అంకుల్"అంది పేలవంగా ఆ అమ్మాయి.

ఈ కథతో సంబంధం లేకుండ బయట మాత్రం ఇంకా వర్షం కురుస్తునే ఉంది. ఇప్పుడిప్పుడే తగ్గేలా కనిపించటం లేదు.

"సార్ ఇంకో అరగంటలో రైలు వస్తుంది సార్"అన్నాడు కంగారుగా ఓబలేసు.

"రామ్మా టికెట్ ఇస్తాను"అని లేచి రిఫ్రెష్ రూమ్ లోకి వెళ్ళాడు చక్రపాణి. అతను శుభ్రంగా మొహం కడుక్కుని వచ్చేసరికి బెంచి మీద కూర్చున్న ఆ అమ్మాయి లేదు. ఆమె బ్యాగ్ కూడా లేదు.

"ఓబలేసు ఆ అమ్మాయి ఏమైంది?"అడిగాడు చక్రపాణి.

"వెళ్ళిపోయింది సార్ "అన్నాడు ఓబలేసు.

"ఒకసారి బయట ఉందేమో చూసి రా"అని ఓబలేసును పంపించాడు చక్రపాణి.

క్షణం తరువాత తిరిగివచ్చాడు ఓబలేసు.

"సార్ ఆ అమ్మాయి ఎక్కడ కనిపించలేదు"అనిచావు కబురు చల్లగా చెప్పాడు.

అంతవరకు ఉద్వేకంతో ఉన్న చక్రపాణి మొహంలో ఎంతో రీలీఫ్ కనిపించింది. గట్టిగా ఒకసారి లోపలికి గాలి పీల్చి పెద్దగా నవ్వాడు.

"ఎందుకు సార్ అలా నవ్వుతున్నారు?"అడిగాడు ఆశ్చర్యంగా ఓబలేసు.

"నా కథ రక్తికట్టినందుకు నవ్వుతున్నాను. నా నటన ఆస్కార్డ్ అవార్డ్ లెవల్ లో ఉన్నందుకు నవ్వుతున్నాను. నీకు తెలియని విషయం చెప్తాను విను. ఆ అమ్మాయి ఎవరో నాకు బాగా తెలుసు. ఈ ఊరి మోతుబరి రాజారావుగారి కూతురు. ఎవడో అనామకుడిని ప్రేమించినట్టుంది. ఆ విషయం తండ్రికి చెప్పటానికి భయపడింది. ఒకవేళ చెప్పిన తండ్రి తన ప్రేమను అంగీకరించడని గ్రహించింది. అందుకే ప్రియుడితో పారిపోవాలని పథకం వేసింది. ఆమెను ప్రేమించినవాడు ఒక లోఫర్. అందుకే నగలతో రమ్మని చెప్పి ఉంటాడు. ఈ అమ్మాయి అతని మాటలు నమ్మి ఇంట్లో ఉన్న నగలు వేసుకుని వచ్చింది. నాతో బావతోడు వస్తున్నాడని చెప్పింది. ఒకవేళ నిజంగా బావ ఉంటే అతను ఆమెను ఇలా రానిచ్చేవాడు కాదు. దాంతో నాకు అంతా అర్ధమైంది. మాములుగా ఆమెకు నచ్చచెప్పి పంపించవచ్చు. ఇంత పెద్ద నాటకం ఆడవలసిన అవసరం లేదు. కాని ఈ కాలపు అమ్మాయిలు అబ్బాయిలకు

మంచి మాటలు రుచించవు. సలహాలు అసలు పడవు. అందుకే సెంటిమెంట్ తో కొట్టాలని అనుకున్నాను. మనిషి దేనికైన లొంగకపోవచ్చు కాని సెంటిమెంట్ కు మాత్రం తప్పకుండ లొంగిపోతాడు. ముఖ్యంగా భారతీయులు తప్పకుండ లొంగిపోతారు. దానికి కారణం భారతీయుల జీవితాలు చాల వరకు సెంటిమెంట్స్ తో ముడిపడిఉంటాయి. అందుకే నాకు ఒక కూతురు ఉన్నట్టు తన పేరు స్వాతి అని ఒక కథ అల్లాను. ఆ కథకు దయనీయమైన సెంటిమెంట్ ను జోడించాను. దాంతో కథ రక్తికట్టింది. పిచ్చి అమ్మాయి నా మాటలు నిజమని నమ్మింది. తను ఎంత పెద్ద తప్పుచేస్తుందో గ్రహించింది. తన జీవితం కూడా నా కూతురి జీవితం లాగా అయిపోకుడదని తెలుసుకుంది. అందుకే నాతో చెప్పకుండ వెళ్ళిపోయింది. ఇప్పుడు నాకు చాల సంతోషంగా ఉంది. నేను అనుకున్న పని విజయవంతంగా పూర్తిఅయింది. రాజారావు నాకు పెద్దగా స్నేహితుడు కాడు. కాని అతని గురించి బాగా తెలుసు. చాల మంచివాడు. సహృదయుడు. ఎంతో మర్యాదగా మాట్లాడతాడు. అతని ఒక్కగానొక్క కూతరి జీవితం నాశనం కాకుండ కాపాడగలిగాను. ఆ అవకాశం భగవంతుడు ఇచ్చినందుకు చాల ఆనందంగా ఉంది”అని ముగించాడు చక్రపాణి.

తరువాత ఇద్దరు గదిలోంచి బయటకు వచ్చారు. అప్పుడే వర్షం వెలిసింది. ఓబలేసు పచ్చజెండపట్టుకుని ఊపాడు. క్షణం తరువాత రైలు మెల్లగా వచ్చి ప్లాట్ ఫారం మీద ఆగింది. అప్పుడే ఒక యువకుడు ఎవరి కోసమో వెతుకుతూ చక్రపాణి వైపు వచ్చాడు. అతనే స్వాతి ప్రియుడని ఆమె కోసమే వాడు వెతుకుతున్నాడని చక్రపాణికి అర్ధమైంది. ఈ విషయం చక్రపాణి మాత్రం అతనికి చెప్పలేదు. చెప్పవలసిన అవసరం అతనికి లేదు. వాడే తెలుసుకుని నిరుత్సాహంతో వెళ్ళిపోతాడు

చక్రపాణి ఊహించినట్టుగానే జరిగింది. పదినిమిషాలు ఆ యువకుడు స్టేషన్ అంతా తిరిగాడు. చివరకు నీరసంగా స్టేషన్ లోంచి బయటకు వెళ్ళిపోయాడు.

★★★★★★★

**Click here to share your comments on this story**